క్లుప్తంగా

స్పీడ్ గన్ ఏర్పాటు



మాచారెడ్డి: మండలంలోని లక్ష్మీరావులపల్లి శివారులో కామారెడ్డి–సిరిసిల్ల రహదారిపై మంగళవారం స్పీడ్ గన్‌ను ఏర్పాటు చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. వాహనదారుల క్షేమం కోరి, వేగ నియంత్రణ చేసి ప్రాణాలు కాపాడేందుకు పోలీసు శాఖ కృషి చేస్తుందని ఎస్సై అన్నారు. వాహనదారులు జాగ్రత్తగా వాహనాలు నడపాలని, నిర్ణీత వేగంలోనే వెళ్లాలని సూచించారు.

ఎకరానికి రూ.30 వేలు చెల్లించాలి



కామారెడ్డి అర్బన్: అతివృష్టితో జిల్లాలో నష్టపోయిన పంటకు ఎకరానికి రూ.30వేలు చెల్లించాలని, పొట్టదశలో ఉన్న వరికి సరిపడా యూరియాను సరఫరా చేయాలని, సోయాబీన్ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని భారతీయ కిసాన్ సంఘ్(బీకేఎస్) డిమాండ్ చేసింది. మంగళవారం కామారెడ్డి బృందావన్ గార్డెన్‌లో బీకేఎస్ జిల్లా సమావేశం అధ్యక్షుడు పైడి విఠల్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో వివిధ అంశాలపై చర్చించిన అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో బీకేఎస్ క్షేత్ర సంఘటన మంత్రి దోనూరి రాము, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనందరావు, రాష్ట్ర కార్యదర్శి కొమిరెడ్డి అంజన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ల శంకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి తరలి రావాలి

భిక్కనూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల 1989–90 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం ఈనెల 14న ఆదివారం పెద్దమల్లారెడ్డి గ్రామంలోని వీరభద్ర ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసినట్లు న్యాయవాది అతిమాముల శ్రీధర్ మంగళవారం తెలిపారు. మూడు పుష్కరాల తర్వాత ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామని, అందరూ ఈ సమావేశానికి తరలి రావల్సిందిగా ఆయన కోరారు.

లయన్స్ క్లబ్ మానవతా సహాయం



కామారెడ్డి అర్బన్: జిల్లాలోని వరదబాధితులకు రూ.15 లక్షల విలువైన వెయ్యి నిత్యావసర కిట్లను బాధిత కుటుంబాలకు అందజేస్తున్నట్టు లయన్స్(320–డి) గవర్నర్ ఏ.అమర్‌నాథ్‌రావు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం కామారెడ్డి ఆర్ అండ్ బీ అతిథి గృహం వద్ద వరదబాధితులకు నిత్యావసర కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అతివృష్టితో జరిగిన వరదనష్టం అపారమైందని, లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్, లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ 320–డి, స్థానిక లయన్స్‌క్లబ్‌ల సహకారంతో మానవతా సహాయం అందిస్తున్నామన్నారు. కామారెడ్డి జిల్లాలో ఎల్లారెడ్డి, సదాశివనగర్, కామారెడ్డి తదితర ప్రాంతాల వరద బాధితుల వివరాలను రెవెన్యూ అధికారుల సహకారంతో తీసుకున్నామని వీరిందరికి ఒక్కో కిట్ రూ.1500 విలువైన 400 నిత్యవసర కిట్లు అందజేశామన్నారు. రెండవ విడతలో వరదలతో నష్టపోయిన ప్రభుత్వ పాఠశాలల వివరాలు తీసుకుని తగిన వస్తు సహాయం చేస్తామన్నారు.

అటవీభూములను సంరక్షించాలి



ఎల్లారెడ్డిరూరల్: అటవీభూములను కాపాడాలని ఎల్లారెడ్డి అటవీశాఖ రేంజ్ అధికారి చరణ్‌తేజ్ అన్నారు. మంగళవారం వెల్లుట్లలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. గ్రామస్తులు అటవీభూములను కాపాడాలని, అటవీ భూములను కబ్జా చేయడం సరికాదన్నారు. భూములను కబ్జా చేస్తే కఠిన చర్యలను తీసుకుంటామన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

బాన్సువాడ: పట్టణంలోని 13వ వార్డు టీచర్స్ కాలనీలో మంగళవారం సీసీ రోడ్డు పనులను మున్సిపల్ మాజీ చైర్మన్ జంగం గంగాధర్ ప్రారంభించారు. 13వ వార్డులో అసంపూర్తిగా ఉన్న సీసీ రోడ్డును, డ్రెయినేజీ పనులను చేపట్టాలని మాజీ కౌన్సిలర్ బాడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కిరణ్మయికి ఫిర్యాదు చేశారు.



జిల్లా పోలీసు కార్యాలయంలో.. ఎస్పీ రాజేశ్ చంద్ర



ఎల్లారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో .. ఆర్డీవో పార్థసింహారెడ్డి



జిల్లా గ్రంథాలయ సంస్థలో.. సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి



లింగంపేట తహసీల్ కార్యాలయంలో..



తాడ్వాయి మండల పరిషత్ కార్యాలయంలో..



ఎల్లారెడ్డి ఎంపీడీవో కార్యాలయంలో..

స్ఫూర్తి ప్రదాత కాళోజీ

సాక్షి నెట్‌వర్క్: ప్రజాకవి, స్వాతంత్య్ర సమరయోధుడు, రాజకీయ ఉద్యమకారుడు కాళోజీ నారాయణరావు తన రచనల ద్వారా ప్రజల్లో స్ఫూర్తి నింపారని వక్తలు అన్నారు. కాళోజీ జయంతిని మంగళవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు.



బీబీపేట తహసీల్ కార్యాలయంలో..



బాన్సువాడ మున్సిపాలిటీలో..



కలెక్టరేట్‌లో కాళోజీ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఇతర అధికారులు



పిట్లం మండల పరిషత్ కార్యాలయంలో ..



మద్నూర్ తహసీల్ కార్యాలయంలో ..



బిచ్కుంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..



జిల్లా కేంద్రంలో బీసీ సంఘం ఆధ్వర్యంలో..



జిల్లా కేంద్రంలో తెరసం ఆధ్వర్యంలో..



ఎస్ఆర్ఎన్‌కే డిగ్రీకళాశాలలో.. అధ్యాపకులు

21న ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో భారీ సభ

పిట్లం(జుక్కల్): స్థానిక ఏఎంసీ కార్యాలయ ఆవరణలో మంగళవారం లంబాడి హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) జుక్కల్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి పిట్లం మండల అధ్యక్షుడు రాజు నాయక్ మాట్లాడుతూ.. ఈనెల 21న సమితి ఆధ్వర్యంలో జుక్కల్ పట్టణంలో భారీ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీ సురేష్ షెట్కార్, స్థానిక ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, గిరిజన కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ తేజావత్ బెల్లయ్య నాయక్ రానున్నారని వెల్లడించారు. సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాణా ప్రతాప్ రాథోడ్, జిల్లా అధ్యక్షుడు నూనావత్ గణేష్ నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రవణ్ జాదవ్, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్ జాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కాట్రోత్ బద్రి నాయక్, జిల్లా గౌరవ అధ్యక్షుడు రూప్‌సింగ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

‘జీఎస్టీని తగ్గించి మేలు చేశారు’



రాజంపేటలో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు



భిక్కనూరులో..



సదాశివనగర్‌లో..

రాజంపేట/భిక్కనూరు/సదాశివనగర్: అనేక వస్తువులపై జీఎస్టీని తగ్గించి సామాన్యులకు ప్రధాని నరేంద్ర మోదీ మేలు చేశారని బీజేపీ నాయకులు అన్నారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీపై తీసుకున్న చర్యలను హర్షిస్తూ మంగళవారం రాజంపేట, భిక్కనూరు, సదాశివనగర్ మండలాల్లో బీజేపీ నాయకులు మోదీ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. దమ్మున్న నాయకుడు ప్రధాని నరేంద్ర మోదీ అని నేతలు కొనియాడారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

బాన్సువాడ రూరల్: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కామారెడ్డి జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విద్య సూచించారు. మంగళవారం ఆమె హన్మాజీపేట్ పీహెచ్‌సీని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. వైద్య సిబ్బంది, యూడీసీ సమయపాలన పాటించాలన్నారు. విధులకు గైర్హాజరయ్యే సిబ్బందిపై శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న మందులు, గర్భిణులకు అందిస్తున్న వైద్యంపై ఆరాతీశారు. ఆస్పత్రిలో డెలివరీలు పెంచాలని సూచించారు.



హన్మాజీపేట్ ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న డాక్టర్ విద్య

ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతం చేయాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి శివకుమార్ అన్నారు. మండల కేంద్రంతో పాటు చందాపూర్‌లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని పారదర్శకంగా ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు. అలాగే గ్రామంలో తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను తనిఖీ చేశారు. ఎంపీడీవో సయ్యద్ సాజిద్‌అలీ, తదితరులున్నారు.

కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు



సాక్షి ఎఫెక్ట్..

ఎల్లారెడ్డిరూరల్: కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు చేయరా అనే శీర్షికన సాక్షిలో మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తిమ్మారెడ్డి– ఆజామాబాద్ గ్రామాల మధ్య ఉన్న రోడ్డు చీమల వాగు ఉధృతికి కోతకు గురి కావడంతో ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు కలిగాయి. అధికారులు స్పందించి కోతకు గురైన రోడ్డుపై మట్టిని పోసి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశారు.

మెరుగైన సదుపాయాలు కల్పించాలి



అంగన్‌వాడీ టీచర్లకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు



దెబ్బతిన్న వంతెన మరమ్మతులను పరిశీలిస్తూ..

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

లింగంపేట(ఎల్లారెడ్డి): ప్రభుత్వ వసతి గృహాల్లో మెరుగైన సదుపాయాలు కల్పించాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సూచించారు. మంగళవారం లింగంపేట రైతు వేదికలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి హాస్టల్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హాస్టల్ వార్డెన్లు సమన్వయంతో పనిచేసి విద్యార్థుల సమస్యలు తక్షణమే పరిష్కరించేలా చూడాలన్నారు. వసతి గృహాల అభివృద్ధి కోసం కావలసిన నిధులు తీసుకురావడానికి కృషి చేస్తానన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందివ్వాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లకు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. ఆర్డీవో పార్థసింహారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు నారాగౌడ్, నేతలు సంతోష్‌రెడ్డి, జొన్నల రాజు, వెంకట్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

లింగంపేట(ఎల్లారెడ్డి): ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా దెబ్బతిన్న పంటలు, ఇళ్లు, చెరువు కట్టలు, వంతెనలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పంట నష్టంపై ఇదివరకే నివేదికను సీఎంకు పంపినట్లు తెలిపారు. రైతులు అధైర్యపడవద్దన్నారు. నష్టపరిహారం అందేలా చూస్తానని భరోసా ఇచ్చారు. అలాగే అయిలాపూర్, పొల్కంపేట, పోతాయిపల్లి, కోమట్‌పల్లి, కన్నాపూర్ తదితర గ్రామాల్లో దెబ్బతిన్న పంటలు పరిశీలించి రైతులను ఓదార్చారు. చెరువు కట్టలు, రోడ్లు, వంతెనలకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఈఈ మల్లేశం, డీఈ వెంకటేశ్వర్లు, ఆర్డీవో పార్థసింహారెడ్డి, తహసీల్దార్ సురేష్, ఏవో అనిల్, తదితరులున్నారు.

రైతులెవరూ అధైర్య పడొద్దు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): పంట నష్టపోయిన రైతులెవరూ అధైర్యపడొద్దని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. నాగిరెడ్డిపేట, జప్తిజాన్కంపల్లి, పల్లె బోగుడతండాలలో మంగళవారం ఎమ్మెల్యే పర్యటించి వర్షాలకు దెబ్బతిన్న చెరువు కట్టలు, అలుగులు, కాలువ కట్టలను పరిశీలించారు. తక్షణమే చేపట్టాల్సిన మరమ్మతులపై ఇరిగేషన్ ఈఈ మల్లేశ్, డీఈఈ వెంకటేశ్వర్లుతో చర్చించారు.

బీసీ డిక్లరేషన్ సభను బహిష్కరిస్తున్నాం



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో ఈ నెల 15న జరుగబోయే బీసీ డిక్లరేషన్ విజయోత్సవ సభను బహిష్కరిస్తునట్లు ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ బోలేశ్వర్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ తలపెట్టిన బీసీల 42 శాతం రిజర్వేషన్ గురించి పార్లమెంట్‌లో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. బీసీ బిల్లుకి శాశ్వత పరిష్కారం రాజ్యాంగంలోనీ 9వ షెడ్యూల్‌లో చేర్చడం ద్వారానే పూర్తి చట్టబద్ధత వస్తుందని అన్నారు. నాయకులు లక్ష్మణ్, అరవింద్, రాజు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడిని పరిష్కరించండి



భిక్కనూరు: నాలుగు రోజులుగా తాగేందుకు గుక్కెడు నీళ్లు కూడా కుళాయిల్లో రావడం లేదు.. మేం ఎలా నీళ్లు లేకుండా బతకాలి అంటూ భిక్కనూరు మండల కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీ మహిళలు భిక్కనూరు గ్రామపంచాయతీ కార్యాలయానికి తరలి వచ్చారు. తమ కాలనీకి నీటిని సరఫరా చేసే పైపులైన్ పూర్తిగా దెబ్బతిందని, వెంటనే మరమ్మతులు చేయించి ప్రతిరోజు నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే చర్యలు తీసుకుంటామని జీపీ అధికారులు హామీ ఇవ్వడంతో వారు శాంతించి వెనుదిరిగారు.

గత అభివృద్ధిని చూసే బీఆర్ఎస్‌లో చేరుతున్నారు

- మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని పెద్దదేవాడలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సింధే మాట్లాడుతూ.. దేవాడ మాజీ సర్పంచ్ సంజీవ్ దేశాయి మరి కొందరు నాయకులు పార్టీలోకి వచ్చారని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌లో చేరారని అన్నారు. యూరియా దొరక్క రైతులు అష్టకష్టాలు పడుతున్నారని వాపోయారు. వారు పడుతున్న కష్టాలు ప్రభుత్వం, స్థానిక నాయకులకు కనపడకపోవడం బాధాకరమని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయలేదని, వచ్చే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ప్రజలు చిత్తుగా ఓడించాలని కోరారు. ఏఎంసీ మాజీ చైర్మన్లు నాల్చర్ రాజు, మల్లికార్జున్, మారుతి పాల్గొన్నారు.



పార్టీ కండువా కప్పుతున్న మాజీ ఎమ్మెల్యే

కూలిన ట్రాన్స్‌ఫార్మర్.. ఎండుతున్న పంటలు



మాచారెడ్డి : పాల్వంచ మండలం మంథని దేవునిపల్లిలో ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల ట్రాన్స్‌ఫార్మర్ నేలకొరిగింది. ఈ విషయం గురించి పక్షం రోజులుగా అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని మాజీ సర్పంచ్ అరవింద్ వాపోయారు. ట్రాన్స్‌ఫార్మర్ పనిచేయకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఎఫ్ఎల్ఎన్ మేళా



భిక్కనూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మండలస్థాయి ఎఫ్ఎల్ఎన్ (ఫండమెంటల్ లిటరసీ అండ్ న్యూమరసీ) మేళాను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ ప్రాథమిక పాఠశాలల్లోని ఉపాధ్యాయులు తయారు చేసిన బోధన ఉపకరణాలను ప్రదర్శించారు. ఎంఈవో రాజ్‌గంగారెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పౌష్టికాహార లోపాన్ని అధిగమించాలి

రామారెడ్డి: విద్యార్థినులు పౌష్టికాహార లోపాన్ని అధిగమించాలని రామారెడ్డి ప్రభుత్వ వైద్యాధికారి సురేష్ అన్నారు. రామారెడ్డి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ వసతి గృహంలో వైద్యాధికారి సురేష్ పౌష్టిక ఆహారంపై మంగళవారం అవగాహన కల్పించారు. వంటకు ఉపయోగించే కూరగాయలు అవసరమైన సామగ్రిని ఎప్పటికప్పుడు తీసుకువచ్చి ఉపయోగించాలని ఎస్‌వో వనితకు సూచించారు. హెచ్ఈ ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

మురికి నీరు నిలువ ఉండకుండా చూడాలి



ఎల్లారెడ్డి: ఇంటి పరిసరాలలో మురికి నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని మత్తమాల ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. లింగారెడ్డిపేటలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వారు ఇంటింటికి తిరుగుతూ.. ఇంటిలో వారానికి మించి నీటిని నిలువ ఉంచరాదని అన్నారు. దీనివల్ల దోమలు వృద్ధి చెందుతాయని అన్నారు. సిబ్బంది గోవిందరెడ్డి, ఠాగూర్ తదితరులున్నారు.

పొందుర్తిలో వైద్య శిబిరం

రాజంపేట: కలెక్టర్ ఆదేశాల మేరకు రాజంపేట మండలంలోని అన్ని గ్రామాలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని మండల వైద్యాధికారి విజయ మహాలక్ష్మి అన్నారు. మంగళవారం పొందుర్తిలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశామన్నారు. వర్షాకాలంలో సీజన్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. డాక్టర్ సంగీత, సూపర్‌వైజర్ మొహమ్మద్ మంజూర్, గంగామణి, ఏఎస్ఎం చంద్రకళ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల విరాళం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మహిళా సాధికారత విభాగానికి పూర్వ విద్యార్థి, అధ్యాపకులు పీవీ నర్సింహం–అరుణ దంపతులు రెండు కుట్టు మిషన్లు అందజేశారు. టైలరింగ్ విద్యార్థులకు ఉపయోగపడేందుకు కుట్టుమిషన్లను విరాళంగా అందజేసిన పీవీ నర్సింహం దంపతులను అభినందించారు.

టీజీ సీపీసెట్–2025లో ఉత్తమ ఫలితాలు

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో పీజీ కోర్సుల ప్రవేశానికి నిర్వహించిన టీజీ సీపీసెట్–2025 ఫలితాల్లో సత్తా చాటిన ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థులను మంగళవారం ప్రిన్సిపల్ విజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ కె.కిష్టయ్యలు, అధ్యాపకులు అభినందించారు. కెమిస్ట్రీలో కె.అరుణ్ 5వ ర్యాంకు, హిందీలో నిఖిల్, సూర్యవంశీ, అజయ్, ఆర్కియాలజీలో జి.అనిల్, జువాలజీలో జల్ల దీపికలు ఉత్తమ ర్యాంకులు సాధించారు.

కూలిపోయిన ఇళ్ల పరిశీలన



బిచ్కుంద(జుక్కల్): బడారెంజల్‌లో వర్షానికి కూలిపోయిన ఇళ్లను మంగళవారం మండల ప్రత్యేక అధికారి, మైన్స్ పీడీ నగేష్ పరిశీలించారు. కూలిపోయిన ఇళ్లకు ప్రభుత్వం నుంచి పరిహారం అందుతుందని, ఆందోళన చెందవద్దను ప్రజలకు వివరించారు. ఇళ్లు కూలిపోయిన వారు ఇందిరమ్మ ఇళ్లు కట్టుకుంటే వెంటనే మంజూరు చేస్తామని, కట్టుకోవడానికి రూ. 5 లక్షలు నిధులు వస్తాయని తెలిపారు. లబ్ధిదారులు ముందుకు రావాలని కోరారు. ఎంపీడీవో గోపాల్, ఎంపీవో కృష్ణ ఉన్నారు.